క్లుప్తంగా

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రాజేశ్

మాడుగుల రూరల్: ఎం. కోడూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు సోమవారం పంపిణీ చేశారు. నోట్ పుస్తకాలు, అచ్చుపుస్తకాలు, తదితర వాటిని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ జుమ్మల భీము నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



గోతులను పూడిపిస్తున్న వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం: ప్రధాన రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే రోడ్డులో ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ఆర్అండ్‌బీ డీఈ దృష్టికి తీసుకువెళ్లి వెనువెంటనే గుంతలను పూడ్చి వేయించారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలు



రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: కడప వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 6 తరగతుల్లో ప్రవేశాలకు మండల స్థాయిలో క్రీడా పోటీలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు స్థానిక హైస్కూల్‌లో 100, 800 మీటర్ల రన్నింగ్ తోపాటు కబడ్డీ, ఖో–ఖో పోటీలను నిర్వహించారు. తొలుత ఈ క్రీడా పోటీలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ప్రారంభించారు. మంగళవారం బాలికలకు కూడా ఈ పోటీలను నిర్వహిస్తామని ఎంపీడీవో శచీదేవి తెలిపారు.

చల్లబడ్డ వాతావరణం



మాకవరపాలెంలో కురుస్తున్న వర్షం

మాకవరపాలెం: వర్షంతో వాతావరణం చల్లబడింది. పది రోజులుగా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న భానుడు ఎట్టకేలకు శాంతించాడు. మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మబ్బులతో వాతావరణం చల్లబడింది. అనంతరం గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉపశమనం లభించింది. ఎండిపోయే స్థితికి చేరుకున్న పంటలకు వర్షం కొంతమేర మేలు చేసిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పసుపుగెడ్డపై కల్వర్టు పనులు ప్రారంభం



వంతెన నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

చీడికాడ: దేవరాపల్లి, చీడికాడ మండలాలను కలుపుతూ చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తికాగా, ఈ మార్గంలో వంతెన నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. చీడికాడ మండలం అర్జునగిరి నుంచి చీడిపల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేర తారురోడ్డు పనులకు వంతెన నిర్మాణానికి రూ 2.5 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, పసుపుగెడ్డ మీద వంతెన పనులు చేపడుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

ఇంటి ముంగిటకే సంక్షేమం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: ఎన్నికల హామీలు 99 శాతం అమలు చేసి ఇంటి ముంగిటకే నాలుగేళ్లుగా సంక్షేమం అందిస్తున్న సీఎం జగన్‌కు మద్దతు పలకాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వీరనారాయణంలో సోమవారం ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. శిథిలమైన విద్యుత్ స్తంభాలతోపాటు, ఇళ్లపై వేలాడే తీగలు వెంటనే సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. డ్రైనేజీలతోపాటు సీసీరోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తామన్నారు. రూ.97 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం ట్యాంకు నిర్మించి 900 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి నెల ఇంటికే పింఛనుతోపాటు సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌కు వృద్ధులు మహరాజు, నారాయనమ్మ, ఆర్లి కృష్ణమ్మ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోయిన నిరుపేద బాధితుడితోపాటు అనారోగ్యంతో మంచం పట్టిన చిట్టి



సంక్షేమ లబ్ధి వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

అప్పారావును పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అప్పారావు కుమార్తెను ఇంటర్మీడియట్ నుంచి చదివిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, హైస్కూల్‌లో నాడు – నేడు కింద రూ.46 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను సత్కరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు కార్యక్రమంలో గర్భిణులను ఆశీర్వదించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఎంపీపీ



సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనువాస్, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు విస్సారపు రామారావు, సర్పంచ్ ఎల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, మాజీ సుర్పంచ్ తూరుబిల్లి సత్తింబాబు, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు దాడి మహేష్, తలారి చిన్నారావు, పాల సంఘం అధ్యక్షుడు ములకలపల్లి శ్రీనివాసరావు, గల్లా శ్రీనువాస్, పద్రే ముత్యాలనాయుడు, ఆబోతు శ్రీనివాసరావు, షేక్ నబీ, దాసరి రాజు, సిరిశోళ్ల మల్లేశ్వరరావు, ఆడారి రామజగ్గ, పడాల అప్పలనాయుడు, కోట్ని శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మరింత మేలు



పది రకాల సేవలపై వలంటీర్లకు పత్రాలను అందించిన సర్పంచ్ సౌజన్య, కార్యదర్శి ప్రశాంత్

కె.కోటపాడు: వలంటీర్లు తమ క్లస్టర్ల పరిధిలోని కుటుంబాలకు జగనన్న సురక్ష కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సర్పంచ్ జి.సౌజన్య తెలిపారు. సోమవారం వారాడ గ్రామ సచివాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలో కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణతోపాటు, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ కరక్షన్, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, ఆధార్ మొబైల్ లింకింగ్‌తోపాటు ఇతర సేవలను జగనన్న సురక్ష ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరును తీసుకువచ్చేలా వలంటీర్, సచివాలయ సిబ్బంది పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి గ్రామంలో వలంటీర్లు ప్రారంభించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్‌పై తుప్పల తొలగింపు



బస్సు షెల్టరు మీద తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ప్రయాణికులకు నీడనిచ్చే బస్సు షెల్టరు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ముప్పై ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది దాతల సహకారంతో నిర్మించిన ఈ షెల్టరును వినియోగంలోకి తీసుకొచ్చే చర్యలు చేపట్టారు. షెల్టరు పై భాగంలో తుప్పలు, దొంకలు పెరగడంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీశెట్టి జగ్గప్పారావు సహకారంతో సోమవారం వాటిని తొలగించారు. షెల్టరును పూర్తిగా తొలగించి తన సొంత సొమ్ముతో కొత్తగా నిర్మిస్తామని ఆయన తెలిపారు. గతంలో స్థానిక శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించిన ఆయన తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

పోటీతత్వంతోనే విద్యార్థుల్లో ప్రతిభ వెలుగులోకి..

కె.కోటపాడు: చదువుల్లో పోటీతత్వాన్ని పెంచి ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్లో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు కె.భార్గవి, ఎం.లహరి, ఇ.శ్రవంతిలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యిలతో పాటు మెడల్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హెచ్‌ఎం.సూర్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.ప్రసాదరావు, బోకం ఎర్రునాయుడు, మురళీకృష్ణ, మల్లాది కామేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు

చోడవరం/మాడుగుల: జగన్నాథస్వామి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉపాలయం, మాడుగులలో జగన్నాథస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. సోమవారం సుభద్ర, ఫలభద్రుడు సమేతుడైన జగన్నాథ స్వామివారికి పెరుగు, పాలతో అభిషేకం చేశారు.

పారదర్శకంగా సమగ్ర భూ రీసర్వే

కె.కోటపాడు: పారదర్శకంగా నిర్వహించే సమగ్ర భూసర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు. భూసర్వే కార్యక్రమంపై సోమవారం చంద్రయ్యపేట గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 1,200 ఎకరాలు సర్వే చేస్తామన్నారు. సర్వే బృందాలకు రైతులు తమ భూములను చూపించడంతోపాటు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, భూమిపాస్ బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ల నంబర్లు ఇవ్వాలని సూచించారు. సర్వే సమయంలో భూయజమానులు వారి భూమి వద్ద ఉండాలని తెలిపారు. డీటీ బి.సూరి, సర్పంచ్ సబ్బవరపు పార్వతి, వీఆర్వో ముత్యాలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల సర్వేయర్ రామచంద్రమూర్తి

కోనేరు స్థలంలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న యర్రాపాత్రుడు, తదితరులు

మాకవరపాలెం: కొండల అగ్రహారంలోని కోనేరు స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయాలంటూ స్పందనలో ఫిర్యాదు అందింది. గ్రామంలోని 114/6 సర్వే నంబర్‌లోని కోనేరు స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నట్టు బూరుగుపాలెం ఎంపీటీసీ సభ్యుడు రుత్తల యర్రాపాత్రుడుతోపాటు చెరువుల పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి రఘు చక్రవర్తి సోమవారం ఎంపీడీవో అరుణశ్రీ, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మిలకు ఫిర్యాదు పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గౌరీశంకర్రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో మూర్తి



ఎంఈవో–2 వరహాలబాబుతో ఎంఈవో అమృత్‌కుమార్, ఉపాధ్యాయులు



హనుమంతరావు



శ్రీనివాస్ నాయుడు



సింహాచలం

నాతవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్. హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన లోకుల యాదగిరీశ్వరరావు ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న హనుమంతరావును పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

నాతవరం తహసీల్దార్‌గా శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: స్థానిక తహసీల్దార్‌గా ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మాడుగుల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన్ను పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఇక్కడ తహసీల్దార్ పి.కనకారావు పరవాడ మండలానికి బదిలీపై వెళ్లారు. మండలంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఎంఈవో–2గా...

దేవరాపల్లి: మండల విద్యాశాఖ అధికారి–2గా వి.ఉషారాణి నియమితులయ్యారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై వచ్చి సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విద్యా శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాల పనితీరును పర్యవేక్షిస్తారు.

మాకవరపాలెం: స్థానిక ఎంఈవో–2గా పి.ఎస్.ఎన్.మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మండలానికి ఒక ఎంఈవో పోస్టు ఉండగా, ప్రభుత్వం రెండో పోస్టును మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పెందుర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న మూర్తిని పదోన్నతిపై మాకవరపాలెం మండలానికి నియమించింది. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

నాతవరం: ఎంఈవో–2గా కామిరెడ్డి వరహాల బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నర్సీపట్నంలో పని చేస్తుండగా ఇటీవల పదోన్నతిపై గునుపూడి హైస్కూల్‌కు ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. ప్రస్తుతం నాతవరం మండలానికి ఎంఈవో–2గా ప్రభుత్వం నియమించడంతో ఎంఈవో తాడి అమృత్‌కుమార్ ఆధ్వర్యంలో విధుల్లోకి చేరారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానన్నారు. సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

చోడవరం రూరల్: ఎంఈవో–2గా కె.సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అల్లూరి జిల్లా పెదబయలు ఎంఈవోగా పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఆర్పీలు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మండలంలోని విద్యా సంబంధమైన సమస్యల గురించి చర్చించారు. పలువురు ఉపాధ్యాయులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న అచ్చింనాయుడు

బుచ్చెయ్యపేట: మృతురాలి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు అందించారు. సీతయ్యపేటకు చెందిన యలమర్తి కమల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా కింద ఈ మొత్తం మంజూరైంది. సోమవారం కమల భర్త వాసుకు నగదు అందించారు. నాయకులు బాబూరావు, సంజీవరావు, చెల్లారావు, మాణిక్యం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లిలో వరి విత్తనాల పంపిణీ నేడు

దేవరాపల్లి: మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఖరీఫ్ వరి విత్తనాలను పంపిణీ చేయనున్నట్టు ఏవో వైకాంతమ్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి హాజరవుతారన్నారు. విత్తనాలు నమోదు చేసుకున్న రైతులు విధిగా రావాలన్నారు.

ఎటువంటి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు

- 'గడపగడపకు' కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఎం. కొత్తపల్లిలో దివ్యాంగుడి సమస్య వింటున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎం.కొత్తపల్లిలో సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలు సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు ఇచ్చేవి కాదన్నారు. ప్రతి ఇంటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏదోఒక పథకం ద్వారా మేలు చేశారన్నారు. స్థానిక సమస్యలను వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా నర్సింగరావు, నంబారు నాగన్న ధర్మశ్రీ దృష్టికి తెచ్చారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ గాడి కాసు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా సంతోష్‌రమణ, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు మొల్లి చినఅప్పలనాయుడు, మాజీ సర్పంచ్ మొల్లి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ మొల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తాం

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: మండల పరిషత్ ద్వారా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన సోమవారం చోడవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలు సమావేశం దృష్టికి తీసుకురావడంతో వాటిని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు చేపట్టారు. తొలుత బడ్జెట్, మండల పరిషత్ ద్వారా చేస్తున్న పనులపై ఎంపీడీవో సువర్ణరాజు సభలో నివేదిక చదివారు. ప్రధానంగా ఎన్ఆర్‌జీఎస్ ఉపాధి పనులు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించే అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది. మండలంలో 12,691 మందికి రైతు భరోసా సాయం అందుతోందని, ఇంకా అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఏవో తులసీ చెప్పారు. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి పనులు వేగవంతం చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకమ్మ తెలిపారు. 47 లేఅవుట్లలో 1,839 మందికి ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశామని, అర్హులైన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ తిరుమలరావు చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటంతోపాటు వాటిని ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా పనితీరు ఉండాలని చెప్పారు. అప్రకటిత విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యలపై చోడవరం పట్టణంలో పలువురు ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, బైన కుమారిఈశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన 'గడపగడపకు'

- ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే గణేష్



జి.కోడూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కొండలు, గుట్టలు ఎక్కి దిగేస్తున్నారు. తాజాగా వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. జి.కోడూరులో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తొలుత నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వర్షంలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు స్థానిక సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. దళితవాడలో డ్రైనేజీలు, బోరుతోపాటు కొందరికి గృహాల మంజూరుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, నాయకులు భద్రాచలం, బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిళ్లా శ్రీను, సర్పంచ్ లాలం బొడ్డేటి అమ్మాజీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్, స్థానిక నాయకులు బొడ్డేటి వెంకటరమణ, వెలగా వెంకటరమణ, రామసత్యనారాయణ, వెలగా రమణ, ఎంపీడీవో అరుణశ్రీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం



సీతయ్యపేటలో విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు అందించిన ఎంపీపీ, జెడ్పీటీసీ



గాదిరాయి హైస్కూలులో విద్యార్థులకు నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం సీతయ్యపేట, తురలకపూడి, విజయరామరాజుపేట, పెదమదీన తదితర గ్రామాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు అందించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, సర్పంచ్‌లు, నాయకులు గోకివాడ వరకృష్ణ, విజయ్‌కుమార్, శ్రీను, వజ్రపు బాబూరావు, బోయిన నారాయణమూర్తి, రామారావు, గుడాల ఆనంద్, నాయుడు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం గాదిరాయి జెడ్పీ హైస్కూలులో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మట్టా బాలమౌనికకు రూ.3 వేలు, కె. వినోద్‌కు రూ.2 వేలు, ఎం. గాయిత్రికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. హెచ్‌ఎం టి. ఆదినారాయణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఊట చంద్రశేఖర్, నాయకులు పద్రె రామునాయడు, ఒమ్మలి పీఏసీఎస్ అధ్యక్షుడు బొడ్డావు భాస్కరరావు, కాతా వెంకటరమణ, సీఆర్పీ అచ్యుతరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: వేచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎం దేవుపల్లి నర్సింహమూర్తి అభినందించారు. జగనన్న ఆణిముత్యాలలో భాగంగా రెడ్డి మౌళి, రొంగలి వీర వెంకట సాయి వర్ధన్, పోతల చైతన్యలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



వినతులను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులను ప్రతి ఇంటికి పంపించి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయంలో ఒకరోజు ఉండి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించాలన్నారు. వలంటీర్ సర్వేను యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనిలో భాగంగా ఓటరు జాబితా ప్రక్షాళనపై బీఎల్‌వోలు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఓటర్లను తొలగించడం, చేర్చడంలో ఆచితూచి పని చేయాలన్నారు. ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై ఆర్డీవోకు ఫిర్యాదు

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ వారం డివిజన్ వ్యాప్తంగా 16 అర్జీలు వచ్చాయి. కార్పొరేట్ పాఠశాలలో ప్రభుత్వం ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కల్పించినా యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పుస్తకాలకు రూ.5 వేలు, యూనిఫాం రూ.3 వేలు, బస్సు ఫీజు రూ.7 వేలతోపాటు అమ్మఒడి రూ.13 వేలు చెల్లించాలని సూచించాయని లాలం శ్రీహరి, ఎం.సతీష్, యు.కృష్ణారావు వాపోయారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. బండి బాటను ఆక్రమించటం వల్ల ఇబ్బందులు పడుతున్నట్టు నీటి సంఘం చైర్మన్ లాలం అప్పారావు ఆధ్వర్యంలో నర్సీపట్నం అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలోని రైతులు ఫిర్యాదు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com